క్లుప్తంగా

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

సైదాపురం: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని పొదలకూరు సెబ్ ఇన్‌చార్జ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలోకి వెంకటగిరితో పాటు సైదాపురంను కూడా కొత్తగా చేర్చినట్లు ఆయన వెల్లడించారు. ఇక నుంచి సైదాపురం మండలం పొదలకూరు సర్కిల్ పరిధిలోకి వస్తుందన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. అక్రమంగా గుట్కా, ఖైనీ లాంటి వాటి విక్రయాలు, కోడి పందేలు, పేకాట ఆడేవారి సమాచారం 9440902520 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

దివ్యాంగులకు చేయూత

గూడూరు : సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్.జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో శుక్రవారం 20 మంది దివ్యాంగులకు సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కుమారుడు వెంకట సుధీర్‌రెడ్డి శుక్రవారం నెలకు సరిపడా ఫలసరుకులను అందజేశారు. ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ సి.రోహిణి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో భూసారం పెంపు

గూడూరురూరల్ : ద్రవ జీవామృతంతో భూసారాన్ని పెంపొందించవచ్చని ఎస్ఎఫ్ఎంటీ తిరుమల తెలిపారు. మండలంలోని పుట్టంరాజు కండ్రిగ క్లస్టర్ తిరువెంగళాయపల్లిలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సామూహికంగా ద్రవజీవామృతాన్ని తయారు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీ గోపీనాయక్, ఏఓ రమేష్ సూచనల మేరకు ద్రవ జీవామృతాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. 2 కేజీల బెల్లం, 2 కేజీల శనగపిండి, 10 లీటర్ల దేశీయ ఆవుమూత్రం, 10 కేజీల ఆవు పేడ, గుప్పెడు పుట్టమట్టి, 200 లీటర్ల నీటిని కలిపి 4 రోజులపాటు ఉంచితే ద్రవ జీవామృతం తయారవుతుందని ఆయన తెలిపారు. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు భూమి గుల్లబారి మొక్కలు బాగా ఎదుగుతాయన్నారు. రైతులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి తిప్పలే..



తుంగమడుగులో మృతదేహాన్ని పంట పొలాల మీదుగా తీసుకెళ్తున్న స్థానికులు

దొరవారిసత్రం: శ్మశానానికి దారి లేకపోవడంతో పంట పొలాల మీదుగా నానా అగచాట్లు పడుతూ పాడిపై మృతదేహాన్ని తీసుకువెళ్లిన ఘటన శుక్రవారం వెదురుపట్టు పంచాయతీ తుంగమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. తుంగమడుగు గ్రామానికి చెందిన దూడల ముజ్జమ్మ మృతి చెందడంతో మృతదేహాన్ని పంట పొలాల మీదుగా శ్మశానానికి తీసుకెళ్లారు. అయితే ప్రస్తుతం పొలాల్లో వరి పంట సాగు చేయడంతో మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు బంధువులు పడిన ఇబ్బంది వర్ణనాతీతం. శ్మశానానికి దారి చూపాలని పదేళ్లుగా రెవెన్యూ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని సర్పంచ్ మధూసూదన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

కేబుల్ వైర్లు సరి చేయాలని వినతి

చిట్టమూరు : మండల పరిధిలోని గునపాడు గ్రామంలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన తడిష్ కేబుల్ ఆపరేటర్లు చిందర వందరగా లాగిన కేబుల్ వైర్లను సరి చేయాలని వైఎస్సార్‌సీపీ రాజేష్ రెడ్డి శుక్రవారం విద్యుత్‌శాఖ డీఈ ఇస్మాయిల్‌కు ఫిర్యాదు చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీధిలైట్లు వేయాలని సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించి కేబుల్‌వైర్లను సరి చేస్తే సంక్రాంతి పండుగకు గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని రాజేష్‌రెడ్డి అధికారులను కోరారు.

ప్రజల చెంతకే సంక్షేమ పాలన

– ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఓజిలిలో సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: ప్రజల చెంతకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను తీసుకొచ్చారని, అందుకే వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను సీఎంను చేసుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఓజిలి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలో 920 ఇళ్లకు గానూ ఈ మూడన్నరేళ్ల కాలంలో రూ.6.39 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని చెప్పారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఓర్వలేకపోతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు సీఎంగా జగనన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, నాయకులు బాబురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, వెంకటసుబ్బరాజు, సుబ్బారావు యాదవ్, హరనాథ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, చెంగయ్య, యూత్ అధ్యక్షుడు పృథ్వీకుమార్‌యాదవ్, అనిల్‌కుమార్, ఖాదర్‌బాషా, సురేష్‌రెడ్డి, రామచంద్రరాజు, దామోదరరాజు, అమరేంద్ర, మైనారిటీ సెల్ అధ్యక్షుడు జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

నాయుడుపేట ఏఎంసీ డైరెక్టర్లు ప్రవీణ, కృష్ణయ్య, ఎక్స్ అఫీషియో సభ్యురాలు శోభారాణి శుక్రవారం ఎమ్మెల్యే కిలివేటికి శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఏఎంసీలో ప్రాధాన్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన..

ఓజిలి సచివాలయ పరిధిలోని ఎస్టీ, బీసీ కాలనీల్లో శనివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొంటారని జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తారని చెప్పారు. అలాగే రాచపాళెంలో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తడలో..

తడ: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే కిలివేటి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కిలివేటి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఎంపీపీ రఘురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈడీఓ మరళీకృష్ణ, తహసీల్దార్ రామయ్య, జెడ్పీటీసీ ఇందుమతి కార్తీక్, డీసీఎంఎస్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం కోట 1, 2 సచివాలయాల పరిధిలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరిస్తూ ప్రభుత్వం నుంచి వారికి అందిన లబ్ధిని తెలియజేశారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగిపోయి అణగారిన వర్గాలు సైతం ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ రమణయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు అవార్డులు



ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను చూపుతున్న అధ్యాపకబృందం

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రమాణాలను గుర్తించి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు మూడు రకాల ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర శర్మ తెలిపారు. దీనిపై ఆయన శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఉత్తమ విద్యాప్రమాణాలకు పాటించినందుకు, పర్యావరణ పరిరక్షణ విషయంలో తీసుకున్న జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వాడుతూ ఇతరులు కూడా వాడేందుకు ప్రోత్సహించినందుకు గానూ నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందుకున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణం పరిశీలన



పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో సచివాలయ నిర్మాణం జరిగిందని కొందరు గ్రామస్తులు కోర్టును ఆశ్రయించడంతో ఆయన పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ విషయంపై పూర్తి స్థాయి పరిశీలన చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

గూడూరు : ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ, అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 25 అంశాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సంక్రాంతిలోపు గ్రామాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఐలు, అట్రాసిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేదురుమల్లి రాక నేడు

వెంకటగిరి: తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటగిరిలోని పార్టీ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చి కలుసుకోవచ్చని చెప్పారు.

తెలుగుగంగ కాలువలో చిన్నారి మృతదేహం

వెంకటగిరిరూరల్: ప్రమాదవశాత్తూ తెలుగు గంగ కాలువలో పడిపోయిన చిన్నారి శుక్రవారం శవమై కనిపించింది. వెంకటగిరి ఎస్ఐ జిలానీ కథనం మేరకు వెంకటగిరి పట్టణానికి చెందిన నక్కా సరిత తమ కుమార్తె యువశ్రీ(4)కలసి ఈనెల 4వ తేదీన పెట్లూరు సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు. యువశ్రీ ప్రమాదశాత్తు కాలువలో పడిపోయింది. దీంతో పోలీసులు బాలిక కేసు నమోదు చేశారు. చిన్నారి యువశ్రీ మృతదేహం బాలాయపల్లి మండలం ఊట్లపల్లి గేట్ల వద్ద ఉన్నట్లు శుక్రవారం పోలీసులకు సమాచారం అందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మండల మీట్

నాయుడుపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు గూడూరులో..

గూడూరురూరల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బూదూరు గురవయ్య అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చంద్రబాబు నోరు ఎత్తకపోవడం వల్లే..



కరపత్రాలను అందిస్తున్న చింతామోహన్

చిల్లకూరు: గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు కూడా దుగ్గరాజపట్నం ఓడరేవు విషయమై స్పందించకపోవడంతోనే విభజన చట్టంలోని పలు అంశాలు అమలు కాకుండా నిలిచిపోయాయని మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం ఆయన జూడో యాత్రలో భాగంగా మండలంలోని నాంచారమ్మపేట, తిక్కవరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో విభజన చట్టం తీసుకుని వచ్చే సమయంలో దుగ్గరాజపట్నం ఓడరేవు ప్రతిపాదనను 32 మంది కేంద్రమంత్రులు ఆమోదం తెలిపి చట్టాలను కూడా చేశారని, అయినా బీజేపీ దుగ్గరాజపట్నం ఓడరేవును పక్కన పెట్టిందని అన్నారు. చంద్రబాబు ఈ విషయంపై నోరు ఎత్తకపోవడం వల్లే విభజన సమయంలో ఇచ్చిన హామీలను బీజేపీ అమలు చేయలేదన్నారు.

నేడు నాయకులతో సమీక్ష

గూడూరు : పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులురెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ముక్కాల ద్వారకానాథ్ హాజరవుతారని, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మహాసభలను జయప్రదం చేయండి

గూడూరురూరల్ : మండలంలోని చెన్నూరు శ్రీకటాలమ్మ దేవస్థాన కల్యాణ మండపంలో ఈనెల 8వ తేదీన జరగనున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గూడూరు డివిజన్ 30వ సంయుక్త మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు ఆర్.గోవిందనాయక్, సుధాకర్‌రాజు కోరారు. శుక్రవారం గూడూరు ప్రధాన తపాలా కార్యాలయం వద్ద మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.

పశువైద్య సిబ్బందితో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి మహేశ్వరుడు

రాపూరు: గ్రామాల్లోని మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పశు వైద్యసిబ్బంది పని చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు తెలిపారు. రాపూరు ప్రభుత్వ పశువైద్యశాల్లో శుక్రవారం రాపూరు, సైదాపురం మండలాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి, ఆర్‌బీకేలోని పశు సిబ్బందికి పశుసంవర్థక శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు సురేష్, ఈఓ సోమయ్య, ఏడీ అనిల్‌కుమార్, రాపూరు, సైదాపురం మండలాల పశువైద్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు పరిహారం చెల్లించండి



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

నాయుడుపేట: నాయుడుపేట–కృష్ణపట్నం పోర్టు రహదారి భూనిర్వాసితులకు త్వరితగతిన పరిహారం అందించాలని సూళ్లూరుపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగరమాల రోడ్డు విస్తరణకు కావాల్సిన భూమిని ప్రభుత్వం సేకరిస్తుందని చెప్పారు. సేకరించిన భూములకు సంబంధించి సర్వే పూర్తి చేసి సర్వే నంబర్, ఆధార్, అడంగల్, వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించి రైతులు ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూడాల్సిన బాధ్యత మీదే అన్నారు. ఈ విషయంలో ఆలస్యం చేయకుండా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయుడుపేట, ఓజిలి మండలాల తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ శేఖర్‌బాబు

చిట్టమూరు : విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచితో కూడిన భోజనం పెట్టాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ బాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఆరూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అలాగే స్కూల్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించారు. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించేలా విద్యాబోధన చేయాలని సూచించారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని పలు ప్రభుత్వ స్కూళ్ల, విద్యావనరుల కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు అభినందనీయం



ఇండోర్ స్టేడియం నిర్మించిన హర్షను సన్మానిస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

గూడూరు : పట్టణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. గూడూరు పట్టణంలోని ఎరీనా ఇండోర్ స్టేడియంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి 12 వరకు వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గూడూరు, పరిసర ప్రాంతాల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 8వ తేదీన ఇండోర్ స్టేడియంలో గ్రేడ్ వన్ క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. హర్ష, దీపు అనే ఇద్దరు యువకులు తమ సొంత నిధులతో మహా నగరాలైన చెన్నై, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్‌లకే పరిమితమైన ఇండోర్ స్టేడియాన్ని గూడూరులో నిర్మించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా వారిని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ శ్రీనివాసులు, చెంచురామయ్య, సూరి, సభ్యులు కరిముల్లాఖాన్, ప్రభాకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.